# "....యమునాతీరే-"

శ్రీ రామగోపాల్

ఉత్తరాన హిమాచలాగ్రం, తూర్పున బంగాళా ఖాతం, అంతటా కటికదరిద్రం—అదీ మన నవీన భారతం.

రాజధాని ఢిల్లీ అంటే, దూరపు మనస్సులలో ఆకాశసౌధాలు కిలకిల లాడుతాయి. కత్తులు ఖణేల్ మంటాయి. సామ్రాజ్య కిరీటరజాలు తళతళ లాడుతాయి. ఏవేవో కథలు గాథలూ బుసబుస పొంగుతాయి—ఎన్నో కలలు, కళలూ మిలమిల లాడతాయి.

కాని వచ్చిచూస్తే మామూలే—మేడలలో చీకటీ, అజీర్తీ; గోడ మీద గుడ్లగూబల గ్రుడ్డి దర్బారు; వీథులనిండా కలీ, చలీ, దుమ్మూ ధూళీ, వడగాడ్పులూ! ఎవడో వచ్చి, అక్కడక్కడ ఒకొక్క నవాబు నవాబుహుక్కా పీలుస్తుంటాడు. వందమంది ఫకీరులు కుక్కలతో కొట్లాడుతూ వుంటారు. మన్యసున్న వల్లకాళ్ల గోరీల మన్యమన్యల, అతినిశిథ సమాధి అంతరాలనించి నక్కలు ఎప్పటిమాటలో చెప్పాలని ఏడుస్తూ వుంటాయి.

అది ఢిల్లీ—

కాని రామున్నాయరు కాసంగతి యింకా అవగాహన అయినట్టు లేదు. అసలది ఢిల్లీ అయినా, మరో పల్లే అయినా ఒకటే నన్న నిర్లిప్తత అతని దృష్టులలో కొరడు గట్టింది. రెండు నెలల క్రితం, మలబారుమారుమూల తన పల్లెలో—ఆ గుడిసెలో, తెల్లారుఝామునే తిన్న చలిదికూడే అతను తృప్తిగా తిన్న ఆఖరుభోజనం! అప్పటినించీ ఏమేమి తిని బ్రతికాడో, ఏయే వూళ్లు తిరిగాడో, అతనికే తెలియదు. రైలు కనిపిస్తే ఎక్కాడు. అది తీసుకెళ్లి-నంత దూరం వెళ్లడం, టిక్కెట్టు లేదని దింపేస్తే దిగడం, అక్కడ మళ్లీ రైలు బయలుదేరుతుంటే అందులో ఒక మూల వొదగడం, యిలాగ ఎక్కడెక్కడికో తిరిగాడు. మాట తెలిసిన చోటులలో కానీ అర్ధణా అడుక్కుని కడుపుకుంట కొత్తకొత్త చల్లార్చుకుంటూ వచ్చాడు. అన్యప్రాంతాలయితే, అతని మూగబాధ గ్రహించి ఏమహానుభావుడయినా యిస్తే తిన్నాడు, లేకపోతే పస్తున్నాడు.

కాని—చచ్చిపోలేదు. ఒకసారి, రెండురోజులేమీ తిండికి లేక, టిక్కెట్టు లేదని రైలు దింపేస్తే, బాధ భరించలేక రైలుపట్టాలమీద పడబోయాడు. పోలీసులు చూసి, లాగి యివతల పడేశారు. కాని, చావనివ్వలేదు. అప్పటినించీ నాయరుకి చచ్చిపోవచ్చుననే ఆఖరిఆశకూడా పోయింది. బ్రతకాలని కాకుండా, కేవలం చావలేకనే బ్రతుకుతూ వచ్చాడు.

"ఎక్కడికి వెడుతున్నావ్?" అన్నాడొకసారి, అతని పక్కలు విరగబొడిచిన ఒక 'రక్షక' భటుడు. నాయరు వెర్రినవ్వు నవ్వాడు. దానితో పోలీసు బూటుతో మరో రెండు తన్నిపోయాడు. ఎక్కడికి వెడుతున్నదీ అతనికిమాత్రం తెలుసునా చెప్పడానికి?

పదేళ్లక్రితం, అదే ప్రశ్న ఎవరన్నా అడిగితే, "యింటికి" అనో, "పొలానికి" అనో చిరునవ్వుతో సమాధానం చెప్పివుండేవాడు నాయరు. ఇంటికీ, పొలానికీ తప్ప, మరోచోటుకి అతను వెళ్లి ఎరుగడు. పక్కవూరు సంతకయినా, జ్ఞానం తెలిశాక మూడునాలుగు సార్లకంటె ఎక్కువ వెళ్లలేదు.

ఇల్లుమాట తలుచుకుంటేనే, నాయరుకి వళ్లు ఝల్లు మంటుంది. ఏ పూర్వజన్మవృత్తాంతంలాగో ఆ కథంతా అతని ఆకలిపేగులలో బొగులుబొగులు మంటుంది. కాని, తిండీ నిద్రా లేకపోయినా, అతని కింకా ఆ పాతభావనల నెమరువేత ఒక్కటే ఆధారంగా మిగిలింది.

* * *

అతను తల్లి నెరగడు. తండ్రి అంతకుముందే పోయాడు. గంజికాచి పోస్తూంటే ముసలిమేనత్తనే "తాయీ" అని పిలుస్తూవుండేవాడు. కామందు రామసాధనుగారి సేవలో, యింటిదగ్గర పశువులూ, పొలంలో పక్షులూ తప్ప, వేరే మనుష్యుల అలంబన యేమీ లేకుండానే అతని బ్రతుకు గడిచింది.

బొగులుమనే ఆ బ్రతుకులో వుప్పెనలాగ వచ్చింది మంగ—ప్రక్కవూరిలో . ఎవరో దూరపు బంధువుల పిల్ల అని, తాయే ఆమనువు కుదిర్చింది. అప్పుడప్పుడు దాచిపెట్టిన డబ్బూ, రామున్నాయరు తల్లి బాపతు వెండికడియాలూ, ముక్కుపుడకా అమ్మగా చేరిన డబ్బూ కూడా చాలకపోతే, కామందుగారిని ప్రాధేయపడి వోలి మూడువందలూ ఎల్లాగో పూర్తి చేసింది. "ఏదో, నే చచ్చిపోతే, నిన్ను కనిపెట్టే దిక్కు వుండాలా? అయినా రత్నంలాంటి పిల్ల రామూ, నీ అదృష్టం—"అని అతనికి నచ్చజెప్పింది తాయి.

నిజానికి, మంగ రత్నంలాంటి పిల్లే. వూరిగుడిసెలో యిమడక వూరంతా గుబాళించిన సౌందర్యం మంగది. మొదట చూడబోయినప్పుడే నాయరుకి కన్ను చెదిరింది. అప్పటినించీ చెప్పలేని గుబులేదో పుట్టింది. ఎర్రని యిమిటేషన్ పట్టుపరికిణీ, అరంగుడే బిగువైన రవికా, పైన మిలమిలలాడే వుత్తరీయం, అన్నింటినీ అలముకొని ప్రసరిస్తున్న ఆ చారెడేసి కళ్లూ—ఆ స్త్రీమూర్తిని చూసి రామున్నాయరు విస్తుపోయాడు. కామందుల ఆడంగులు కట్టే ఫాయాలో వున్న ఆ దుస్తులన్నీ ఎక్కడివా అని ఆశ్చర్యపడ్డాడు. ఎవరో ఆపిల్ల బంధువు—కాస్త కలిగివున్న వాడు—ఎప్పుడో బహుమానం యిచ్చిన బాపతని, యింటికొచ్చినతర్వాత తాయి చెప్పగా విన్నాడు.

రెండేళ్లు!—ఇంగితం తెలిశాక ఎవరి ఆదరణా ఎరగని ఆహృదయం మంగచుట్టూ పెనవేసుకుపోయింది. ఆ వుప్పెనలో వుక్కిరిబిక్కిరవుతూనే వుర్రూత లూగాడు.

తన చేతులతోటే వేరే పాక వేశాడు. అన్ని ఏళ్లు పనిచేసిన కామందు, ఏవో అగావులేసి పాలేరుతనం తీసేస్తే, కూలిపనులకి వెళ్లి సంపాదించాడు. నోటిమంచి చేత, ఒక కాడిగిత్తలని ఎరువుతెచ్చి కొంత కవులు వ్యవసాయంకూడా సాగించాడు. పొలమే యిల్లుగా రాత్రింబగళ్లు వొళ్లు హూనంచేసుకున్నాడు. మంగని తన జీవితంలో అమర్చుకోవాలని—మంగకి తన జీవితం అమర్చాలని—ఎప్పటికప్పుడే ఆరాటపడ్డాడు.

ఆ ఏడు పొలం బాగా పండింది. పాత కామందు మనసు మళ్లీ అతనికే కొంత భూమి అమరకంకూడా యిచ్చాడు. అతను ఒక కాడి గిత్తలని కొనా లనుకున్నాడు. మంగకి ఆడపిల్ల కలిగింది. 'ఓనం'పండగ వచ్చింది. రామున్నాయరుహృదయం ఆనందంతో నిండి నిట్టూర్చింది!—పండగకి మంగ పుట్టింటికి వెళ్లివచ్చింది!—

రెండోఏడు అతని స్థితి మరింత బాగుపడింది. మొదట వెటకారాలు చేసిన ఆసామీలుకూడా క్రమంగా సద్దణగి అతనికి గౌరవం చూపించారు. నాయరుకూడా కొంత స్థిరపడ్డాడు. పొలంపనీ, యిల్లూ—అతని జీవితమంతా ఒక దినసరిక్రమానికి వస్తోంది.

మంగబంధువు, ఒకతను, చూడడానికి వచ్చాడు. పెళ్లిచూపులప్పుడు మంగ వేసుకున్న వుడుపులు అతను యిచ్చినవేనని నాయరుకి తర్వాత తెలిసింది. అతని పేరు 'వేలూ'ట. మళ్లీ మంగకి ఒక విలువైన చీర తెచ్చాడు. పంట్లామూ, కోటూ వేసుకుని, 'వేలూ' ఆపాకలో వున్న ఒక్క ముక్కాలిపీటమీదా కూర్చుని, మంగతో మాట్లాడుతూంటే, వీధినిపోయే వాళ్లు ఒకళ్లిద్దరు అక్కడే నిలబడిపోయి వెటకారంగా

చూశారు. నాయరుకూడా, వొళ్ళంతా పొలం మట్టి తోటి యింటికి వచ్చేటప్పటికి—మంగనీ, వేలూనీ చూసి విస్తుపోయాడు. తర్వాత మంగ—వరసకి తన బావ అవుతాడనీ, వాళ్లింత వున్నవాళ్లనీ, అత నేదో చదువుకుంటూ సెలవలకి వచ్చాడనీ వేలూనిగురించి చెబుతుంటే రామున్నాయరుఆశ్చర్యం క్రమంగా మంచులాగ కరిగిపోయింది. మళ్లీ రెండుమూడుసార్లు వేలూ వచ్చినప్పుడు నాయరు గుర్తించనేలేదు.

కాని, వూరివారు గుర్తించారు. మంగకి వేలూతో సంబంధం అంటగట్టారు. రామున్నాయరు వెర్రిబాగులవాడని కొందరు కొంటెకోణంగిపద్దులు అతడిని చూసి వ్యంగ్యంగా వెటకారాలుకూడా ప్రారంభించారు. నాయరు మనస్సులో ఏమనుకున్నా, మంగను చూసి మాట్లాడలేకపోయేవాడు. ఎప్పటి కప్పుడే ఏదో అడగబోయి, సవరించేసేవాడు. ఇలాగ నాలుగునెలలయేసరికి, వేలూ వచ్చిపోతుండడం పరిపాటయిపోయింది. పుకారుకారుల నోళ్లుకూడా నొప్పి పెట్టి చప్పబడిపోయాయి. నాయరుకికూడా పొలంపని ఎక్కువయి, మనస్సులో యీ గొడవ మెలగడం తగ్గింది.

ఒకనాడు, సంజచీకటులు పడుతుండగా, అతను, పొలంనించి వచ్చేసరికి, మంగ ఎదురుపడలేదు. తాయి మాత్రం తన గుడిసెలో చంటిపిల్లని జోకొడుతోంది. మధ్యాహ్నమే వేలూ వచ్చాడని తాయీ చెప్పింది. అప్పటినించీ, మంగ వప్పజెప్పిన చంటిపిల్ల ఆవిడదగ్గరే వుండిపోయింది.

మంగపాకంతా చూశాడు నాయరు. అప్పుడప్పుడు తాను కొన్న చీరెలూ, రవికెలూ అలాగే పడివున్నాయి. మంగ తెచ్చుకున్న దుస్తులు—అప్పుడప్పుడు మురిపెంగా కట్టుకుని ముచ్చటపడుతూవుండే వేలూబహుమానాలు మాత్రమే ఎక్కడా కనిపించ లేదు.

ఊరంతా వెతికాడు. తెల్లారుఝామునే అత్తవారి వూరుకూడా వెళ్లాడు. కాని, మంగ కనిపించ లేదు. వేలూకూడా పత్తా లేదు!

పిడుగు నెత్తిని బడ్డట్టు నాయరు కూలిపోయాడు. వారంరోజులవరకూ మళ్లీ యిల్లు దాటి వెళ్లలేక పోయాడు.

తాయి ఎంతో చెప్పింది. చంటిగుడ్డుని చూసుకోవా లంది. ఆఖరికి, "అది చచ్చిపోయిం దనుకో—" అనికూడా అనేసింది.

"మంగ చచ్చిపోయిం దంటావా?—కాదు, తాయీ—"అని చెప్పలేని మాట లెన్నో కళ్లమ్మట నీళ్లుగా రాల్చాడు నాయరు.

ఆ రోజు లగాయితు నాయరుబ్రతుకు యింకో సుడి తిరిగింది. అతని మనఃస్థితీ, పరిస్థితీకూడా నానాటికీ నాదారయిపోయాయి. అయినా ఆబిడ్డని చూసుకుంటూ, ఆ బిడ్డకోసమనే బ్రతుకుతూ వచ్చాడు.

ఎంతలేని చరిత్రలనో యిట్టే దిగమింగే కాలం కడుపున, క్రమంగా ఆ చిన్నభూకంపంకూడా హరాయిం పయిపోయింది. ఇదివరకులాగే, మళ్లీ తాయీ, అతనూ మిగిలారు. ఆ ఏకాకిజీవితంలో అడ్డుకాపుకో అన్నట్టు కొత్తగా ఒక కుంపటిమాత్రం వదిలిపోయింది మంగ.

ఏళ్లు గడిచాయి. ఎరకలు విరిగి పోతున్న పక్షి గిజగిజే నాయరులో మిగిలింది. చాలాసార్లు ఆవూరు వదిలి ఎక్కడకో పోవా లనుకున్నాడు. కాని, తాయీ అక్కడే చచ్చిపోవా లంది. అతనికీ, 'చిన్నిమంగ' కీ తాయీయే తల్లీ, సంరక్షకురాలూ అయింది. 'చిన్నిమంగ' అనే పిలిచేవా డతను. తాయీమాత్రం 'కన్నమ్మ' అని వేరే నామకరణం చేసింది.

మంగ సంగతే క్రమంగా మరిచి పోయారు వూళ్లోవాళ్లు. ఎగతాళి జాలిగానూ, జాలి క్రమంగా స్నేహంగానూ అయి, మళ్లీ నాయరు కొత్త మనిషయి తిరిగాడు— మనుషులలో పడ్డాడు. కన్నమ్మకి ఎనిమిదో ఏడొచ్చింది. నాయ రింక 'మంగా' అనే ఆ పిల్లని పిలుచుకునేవాడు. కూటిగింజలకోసం కూలికి వెళ్లినప్పుడు తప్పితే, ఎప్పుడూ ఆపిల్లతోటే అతనికి కాలక్షేపము అయేది. 'మంగ' కూడా తాయీకి చిన్నపనీ పెద్దపనీ సహాయంచేస్తూ వుండేది.

రోజు లలాగ, ఒక మోస్తరుగా వెళ్లి పోతున్నప్పుడే, ముగ్గిపోయిన పండులాగ తాయీ అగుత్తినించి రాలిపోయింది. తల్లి నెరగని నాయరు చంటివాడిలాగ గోలెత్తి పోయాడు. కాని, ఒక గాలివానకి వొరిగిన వృక్షాన్ని తర్వాత తుపాను లంతగా బాధించనట్టు, తాయీ పోయిన దుఃఖంలోనించి అతను త్వరగానే తెప్పరిల్లాడు. అదీగాక, అనుభవాని కింకా చిన్నదే అయినా, అవసరానికి పెద్దదే అయింది 'మంగ'. అన్ని పనులూ అందుకు చేస్తూ, తండ్రికి తాయీపోయిన లోటు కొంత కనిపించకుండా చేసింది. మొదట కష్టమనిపించినా, విధిలేక చివరకి, యిల్లంతా ఆపిల్లమీదనే వదలి పెట్టాడు నాయరు. ఏమి వున్నదీ లేనిదీ మంగని అడగాలి. ఏది ఎక్కడ వున్నదీ మంగకే ఆకళింపు. మంచికీ, చెడ్డకీ మంగదే అతనికి పెద్ద సలహా అయింది. పెద్ద మంగలో అత నొకప్పుడు ఆశించి పొందలేకపోయిన అప్యాయతా, ఆదరణా పూర్తిగా యీ చిన్న మంగలో చూసుకుని అతను పరిపరివిధాల మురిసి పోయాడు.

కొడు చివురించినట్టు అతను మళ్లీ కొత్తగా జీవితం ప్రారంభించాడు. మొహంలో కళా, పనిలో చురుకూ, మాటలో వుత్సాహం అంకురించాయి. పై వాళ్లకి యీ మార్పు ఆశ్చర్యంగా కనిపించింది. చూస్తూ వుండగానే ముసలివా డయిపోయిన నాయరు మళ్లీ నవయువ్వను డవుతున్నాడా అనిపించింది. కాని, కాని—

కునికే ముందు దీపం మినుకు మాత్రమే అయిందా మార్పు: ప్రళయం ముందరి ప్రశాంతతే అయిం దతని కాసుఖం—

అదేమి రోగమో అని యింకా వూళ్లో ఆశ్చర్యం తగ్గనే లేదు. 'బర్మా జ్వర'మని తర్వాత కొందరన్నారు. గంటలమీద కొన్ని ప్రాణాలు బలి అయి పోయాయి. వాళ్ల పెడ మరీని—ఏడవని కొంపే లేకుండా పోయింది. పొద్దున్న పదిగంటలకి అంకురించింది—అంతే, చీకటి పడేలోపునే చిన్నమంగని కాజేసింది.

ఆ రాత్రి నాయరు కింక తెల్లారలేదు—మర్నాడు చూస్తే, అవూరి వాళ్లకి మంగతోపాటే నాయరు కూడా మాయమై పోయాడు. అతని కొంపలోకి ఎన్నడూ తొంగిచూడని వాళ్లుకూడా అతని శవం కోసం నూతులూ, గోతులూ గాలించారు.

ఒకరోజు, రెండురోజులు— ఊరిలోని చిత్రపు చావులతో బాటు నాయరు వుదంతం కూడా చిలవలూ, పలవలూ అల్లి చెప్పుకున్నారు. మూడోరోజుకల్లా, ఎవరి పనుల్లోవాళ్లు పడి, యీగొడవే మరిచిపోయారు—ఆవూళ్లో నాయరుబ్రతుకు ఆ విధంగా మాటుమణిగి పోయింది—

కాని, నాయరుమాత్రం మాటు మణగలేదు. చిన్నమంగదాకా వచ్చిన ఆజ్వరం నాయరుని చంపలేకపోయింది. మతి చెదిరి అతను ఆలాగే బికారిలాగ వారంపదిరోజులు వూరూరా తిరిగాడు. మనుషులని చూడగానే బెదిరి దూరానికి పరుగెత్తేవాడు. ఎక్కువగా పొలాలమ్మటే తిరిగేవాడు. ఆఖరి కొకనాడు పంటకాలవగట్టున పడివుంటే, పొలంనుంచీ వస్తున్న రైతు లెవరో ఇంత గంజిపోసి బ్రతికించారు. కాని అతని వూరేమిటో పేరేమిటో—పత్తా తెలుసుకోలేకపోయారు. అన్నిటికీ ఒకటే సమాధానం. అతని వెర్రి నవ్వు చూసి, పిచ్చివా డని వదిలేశారు.

కాని అతను పిచ్చివాడు కాలేదు. అప్పటిమట్టుకు అణగారిపోయిన జ్ఞాపకశక్తి క్రమంగా మళ్లీ అతనిలో కొలుకుని అగ్నిపర్వతాలు రేపింది. ఆకలి దప్పులు రగిలించింది. ఆలాగే, చావలేక బ్రతుకుతూ, బ్రతకడానికి బాధలుపడుతూ రామున్నాయరు దేశాలు పట్టాడు.

యుద్ధపురోజులు. రైలుపెట్టెలు బట్టల పెట్టెలలాగ తలుపులు పడటం లేదు. బెంచీకింద పరుపుచుట్ట పక్కనే దుమ్మూ, బీడీపీకలూ మధ్య యిరికాడు నాయరు. ఆఖరికి పెట్టె అంతా ఖాళీఅయినా, అక్కడే పడుకున్నాడు. కడుపు మండుతోందికాని కాళ్లూ చేతులూ నిస్త్రాణచేత కదలడానికి బద్ధకిస్తున్నాయి. అడుక్కున్న బాపతు అరణాల డబ్బులతోటీ ఏదైనా కొనుక్కుతినా లని మనస్సులోమాత్రం ఆశ గిజగిజ లాడింది. రైలువాళ్లే వచ్చి లేవగొట్టారు,

స్టేషను చూస్తే, అదేదో పెద్ద పట్టణమే నని అతనికి తోచింది. టికెట్టుకలెక్టరు ఒక గంటన్నరసేపు అతడిని ఏడిపించాడు. అరణాలకంటె అతనిదగ్గర ఏమీ లేవని తెలుసుకుని స్టేషనుఅవతలకి తరిమించేశాడు—ఆ డబ్బులుమాత్రం లాక్కుని!

స్టేషనుఎదురుగానే ఉన్న రిక్రూటింగు మకాములో నాయరుకి రెండురోజులు గంజిపోశారు. మూడోరోజుని వైద్యపరీక్ష. డాక్టరు అతడిని పీకాడు, గోకాడు, పొడిచాడు. బాగా బయటపడ్డ అతని రొమ్ము ఎముకలనిండా—ఎరుపూ, వూదా, ఆకు పచ్చా పెన్సిళ్లు పెట్టి, ఏవిటో గీతలు గీశాడు. అవన్నీ తర్వాత ఒక గుమాస్తా తర్జుమాచేసి, కాగితం మీదికి ఎక్కించాడు. అంతా అయాక, సైన్యంలోకి పనికిరావు పొమ్మన్నారు.

మేడలలో కలీ, వీధులనిండా చలీ, ఆకలీ. చచ్చి బ్రతకడానికి తగడని బ్రతికిచావమని వదిలేశారు.

అది ఢిల్లీరాజధాని అని నాయరు అప్పుడే తెలుసుకున్నాడు. కాళ్లు ఎటు తీసుకువెడితే అటు వెళ్లాడు.

డిసెంబరు నెల. సాయంకాలం నాలుగు గంటలు అయింది. అంతవరకు అగుపించని సూర్యుడు, అప్పుడే చలిచేత చంద్రుడై, వణుకుతూ ఇవతలకి వచ్చాడు. యమునానది ఎప్పటెప్పటివో రాజుల, రాజ్యాల రక్తిమలు తళతళ లాడించుకుంటూ ప్రవహించుకుపోతోంది. నాయరు తిన్నగా "కాశ్మీర దర్వాజా" చేరుకున్నాడు. మొదటి స్వతంత్ర యుద్ధం అని చెప్పే, స్వదేశ రాజుల ఆఖరి తిరుగుబాటులో, ఆ కోటగుమ్మముమీదనే యింగ్లీషుసైన్యాలు ముట్టడి చేశాయని అతనికి తెలియదు. అగోడకవతలే వున్న మైదానంలో కొంచెం సేపు విశ్రమించి, తిన్నగా తిమారుపూరు వేపు వెళ్లాడు—

తిమారుపూరు కేవలం సర్కారు గుమాస్తాలుండే పేట. యమున వొడ్డునే వుంది. వరదలొచ్చినప్పుడు, కొంత యమునలో కూడా వుండటం కద్దు. కొత్త ఢిల్లీ కట్టక పూర్వం, తెల్లరాజువైస్రాయి దర్బారంతా ఆ పెడ వున్నప్పుడు వెలిసింది తిమారుపూరు. ఆదరిమిలా, పశువులకి పనికిరాకపోడం చేత, గుమాస్తాలకే యింకా ఇస్తున్నారుట. ఆయిళ్లు అన్నీ ఒకలాటే అచ్చోసినట్టు చీదర వోడుతూ వుంటాయి. ఖైదీలకి మల్లే నెంబర్లని బట్టే వాటికి గుర్తు. ఆలాగ నెంబరువారీ కానీ కట్టడాలు ఆచుట్టుప్రక్కలకల్లా రెండే కనుపిస్తాయి. ఒకటి పాడడ్డ మసీదు. ఒకప్పుడది దేవాలయం అయినట్లు కాస్త పరకాయిస్తే తెలుస్తుంది. మొగలు దర్బారుకి తెచ్చినప్పుడు శివాజీని అందులోనే బంధించివుంచారని ఒక కథ కూడా చెబుతారు. రెండోది యమునగట్టున రేవులోనే వున్న మఠం. అక్కడే ఒక చిన్న శివాలయం కూడాను. అర్చకు డంటూ లేకపోవడంచేత, అన్ని వేళలా దేముడు కనిపిస్తూ ఉంటాడు. కాని భక్తుల కంటె బైరాగులే అక్కడ ఎక్కువ. ప్రక్కనేవున్న ఆవరణతాలింఖానాలో, ముఖ్యంగా శిక్కుల కుర్రవాళ్లు సాయంత్రాలప్పుడుమాత్రం కసరత్తులు చేస్తూ ఉంటారు.

అప్పటికి బాగా చీకటిపడింది. అతి సుతారం అయిన పొగమంచు మేలిముసుగుమాటున యమున ఆవలిస్తోంది. మఠంముందు రావిచెట్టుదిమ్మమీద నెగడి మండుతోంది. ఆ నెగడితాలూకు బైరాగికి బదులు రామున్నాయరక్కడ చలికాగుతున్నాడు—కొయ్య బారిన వళ్లు కాస్త వెచ్చగిల్లడంతోటి, కడుపులో నెమ్మకొన్న ఆకలి కరిగినట్లు రగలడం మొదలు పెట్టింది. కూర్చున్నకొద్దీ మరింత మండిపోయింది. రేవులోకి దిగి యిన్ని యముననీళ్లు తాగాడు. లోపలి మంట కది ఆజ్యంపోసినట్లు అయింది. వణుకుతూ మళ్లీ నెగడిదగ్గరకి వెళ్లేసరికి బైరాగికూడా ఎటునించో అక్కడికి చేరుకున్నాడు. తెచ్చుకున్న రొట్టెలదొంతర ముందరపెట్టుకుని విందారగిస్తున్నాడు.

నాయరు దిమ్మకిందనే నిలబడిపోయాడు. అతని వళ్లూ కళ్లూ అంతా ఏకంగా ఒకలాటే ఆకలితో దహించుకుపోతోంది. కసరత్తుకుర్రాళ్లు యిద్దరు యింటికెడుతూ, అప్పుడే ఆ రేవులోకి వచ్చారు. ఎవరిని అడుగుదామన్నా, అతనికి, మాట తెలియదు. కాని

జంతువులాగ ఏదో శబ్దం చేశాడు. బైరాగి ఒక రొట్టెలో కొంచెంభాగం విరిచి అతనికి పడేశాడు.

నాయరది యిట్టే మింగేశాడు. ఆరోజుకి సరిపడా పెద్దనర్మం చేసేసినట్లు, బైరాగి, ఏవూరనో, ఏమిటో అతడిని పలకరించబోయాడు. "మద్రాసీ" అని ఏవో నాలుగుమాట లంటూనే, కసరత్తుకుర్రాళ్లు వాళ్లలో వాళ్లు అని వెళ్లిపోయారు. బైరాగి సంతృప్తి పడియింక పలకరించకుండానే రొట్టెలు పూర్తిచేశాడు. ఈదురుగాలికి సెగడు పెద్దమంట అయింది. తిన్న రొట్టెతునకతో నాయరుఆకలి మరింత దుర్భరం అయిపోయింది.

కడుపు మండితే జంతువు కట్టుతాడు తెంపుకు పోతుంది. మనిషికి కట్టుతాళ్లు వుక్కువి—అవి తెంప బోతే వూచలై బిగుస్తాయి, కత్తులై చంపుతాయి.

బైరాగి రొట్టెలు తింటున్నంతసేపూ, రాము న్నాయరు అవి తీసుకోవాలనే అనుకున్నాడు. కాని మొదట చేతులు కలిసిరాలేదు. కొద్ది సేపటికి, ఆకలి వేళ్లచివర్లని వంచేటప్పటికి, కాళ్లు వెనక్కి తీశాయి. చివరికి, అతను చేతులు సవరించుకుంటూ అటు రెండు అడుగులు వేశాడు. కాని అప్పటికి రొట్టెలు అయిపోయాయి !—

అక్కడనుంచీ కదిలాడు నాయరు. ఒక వేపు యమున, చంపి రక్షింపగల దాక్షిణ్యంకూడా నీరసించి మోకాలులోతునే తేకుతోంది. గట్టుఎగువకే కదిలాడు నాయరు. చలి, ఆకలి, గాలి అతని ఎముకలు మెలేసి విరిచేస్తున్నాయి.

గమ్మున దేవాలయంవేపు తిరిగింది అతని తల. తలుపు తెరిచే ఉంది.

కళ్లంతా కడుపుచేసుకుని చూస్తున్న అతనికి ఒక పెద్ద పళ్లెంనిండా పళ్లూ, పిండివంటలూ కనిపించాయి. మెరుస్తున్న ఆవెండిపళ్లెం ప్రక్కనే ప్రమిదలో బాదంపలుకులాగ దీపం, దీపంవెలుగులో పెద్దతాటి పండులాగ విగ్రహం ఆనాయి.

దడదడలాడుతూనే అటు పరుగెత్తాడు. గుమ్మం దగ్గిర ఒక్కక్షణం సాష్టాంగపడ్డాడు. కణతలు నొక్కుకున్నాడు. తిన్నగా లోపలికి వెళ్లి, పళ్లెంలో పండు ఒకటి తీసి మింగేశాడు. కూచుని పళ్లెం ఒళ్లో పెట్టుకున్నాడు. కెవ్వుమని ఆడకేక గర్భగుడి రింగెత్తింది. గమ్మున గుమ్మంకేసి చూశాడు-

అది కలా ?

ఒక్కసారి కళ్లు గట్టిగా చిట్లించి చూశాడు.

నమ్మలేక పోయాడు- గ్రామంలో ఖామందుల యింట్లో చూచిన లక్ష్మి బొమ్మపోలిక తోచింది. అతనికి చలి వచ్చింది. ఆకలిని మింగేసిన మంట ఏదో వళ్లంతా పొగలూ, శగలూ రేగింది.

ఒక చేతిలో పళ్లెం, యింకో చేతిలో సగం తిన్న అరటిపండు—అతను అలాగే నిలువునా లేచాడు!

బెనారసు చీర గరగరమంది; వడ్డాణం తళుక్కుమంది.

అదంతా ఒక్కక్షణం !—

ఆవిడ తిరిగింది. వెళ్లిపోతోంది.

"నేనూ !—" అరిచాడు.

ఒక అడుగు అవతలకి వేసింది.

"నేనూ, నేనూ,"—

చటుక్కున ఆగింది.

"మీ... మీరు— భయపడవద్దు."

ఆవిడ అలాగే నిలిచిపోయింది.

"వెళ్లిపోతాను మళ్లీ—వూళ్లో యింక వుండలేక వచ్చేశాను..."

ఆవిడ అతనివైపు తిరిగింది. ఆ ముఖంలో అతనికి వురుములూ, మెరుపులూ కనుపించాయి.

"అక్క డెవ్వరూ లే రింక—తాయీ చచ్చిపోయింది."

తనువంతా ఒకటే ప్రశ్నగా ఆవిడ పెదిమలపైన వణికింది.

"చిన్న—?"అంది సన్నగా.

అతను నిర్ఘాంతపోయాడు !

అది కలకాదు. కళ్లు దగా చెయ్యలేదు. ఆమె మాట మారలేదు. ఏమిటో అదటు, ఆగ్రహం ఒక్క

పోకే అతని మనస్సులో దుమారం రేపాయి. ఎన్నో ప్రశ్నలూ, మాటలూ అతని గొంతుకలోనే బిగుసుకుపోయాయి.

"మంగా!"—అన్నది ఒక్కటే పెదిమలు దాటింది.

ఆవిడ ఒక్క అడుగు ముందుకు వేసింది.

"చిన్నది?—" అంది మళ్లీ, కఠినంగా.

"చిన్నమంగ—" అంటూ అతనిక మాటాడలేకపోయాడు. చంటివాడిలాగ వెక్కి వెక్కి ఏడిచేశాడు.

"చిన్నమంగ అంటే—" అని అర్ధోక్తిలోనే ఆవిడ ఒక పెద్దనిట్టూర్పు విడిచింది. యింకో అడుగు ముందు కొచ్చి గుమ్మంమీద వొరిగింది.

"మాదుమూర్తులా నువ్వే మళ్లీని. 'చిన్నమంగ' అనే పిలుచుకునేవాడిని. దానికీకూడా నేను తగననిపించిందికాబోసు దేముడికి. ఆకాస్త ఆస్కారం కూడా లేకుండాచేశాడు—యింక నే నొక్కడినే మిగిలాను. చావలేక, యిలా దేశాలుపట్టి బ్రతుకుతున్నాను."

పైటకొంగుతో ఆవిడ కళ్లు వొత్తుకుంటూంది. సముద్రకెరటంలాగ ఆవిడరొమ్ము పైకి లేచి పడుతూంది. తుపానులో మల్లెతీగలాగ ఆపాదమస్తకం కంపించిపోయింది!

"మాయజ్వరం...ఒక్క రోజులోనే మింగేసింది. నేనేం చెయ్యలేకపోయాను—" అతని గొంతుక మళ్లీ నొక్కుకుపోయింది.

"విధవపూరు!...ఆ బ్రతుకు—నువ్వు—నువ్వు నాచిన్నని—" అని ప్రళయకంపంతో ఆవిడ వురిమింది.

"కాదు కాదు...నా చిన్నమంగ కేమీ అపరాధం చెయ్యలేదు. ఎనిమిదేళ్లు పెంచాను...... అయినా...అయినా...అవును!...నాది కూలిబ్రతుకు. మొదటినుంచీ అంతే...కూటికే గింజాలాట... నీ ఆశలూ...కోరికలూ...అందుకోలేక పోయాను... ప్రయత్నించాను...కష్టపడ్డాను...కాని, ఎల్లాగ?... భవనాలలో ఉండవల్సినదానవు...పాకలలో తప్పబుట్టావు...అక్కడెల్లాగ వుండగలవు?...నే ననుకుంటూనేవుండేవాడిని...అదే నిజం అయింది... కాని, నాచిన్నమంగకయినా నాబ్రతుకు పనికొచ్చేటట్టు చెయ్యాలనుకున్నాను...కాని కష్టమేపడింది నాకోసం...అంతే...నేనూ......నా దిక్కుమాలిన బ్రతుకూ...నీకు సరిపడలేదు...నాచిన్నమంగకీ సరిపడలేదు...అందుకే...అందుకే!...అవును......నా బరువు నేనే మొయ్యాలి?..."

అతని కన్నీళ్లు ఎండిపోయాయి. గుమ్మందగ్గిర ఆవిడ కుప్పగా కూలివుందని చూశాడు!—

"మంగా!..."

ఆవిడ పలకలేదు.

"నీసుఖం, ఆనందం...కళ్లారా చూశాను!... అంతకంటె నాకింకేమీ అక్కర్లేదు!...యిక్కడే... యిలాగ...చూస్తాను అనుకోలేదు...బ్రతుకికంతా యీ ఒక్క అదృష్టం కలిగింది..."

"అబ్బా—!" నిట్టూరుస్తూ ఆవిడ ముఖం పైకెత్తింది...

అత నేదో మళ్లీ చెప్పబోయాడు. అంత మాటలాడిన ఆవేగంతో, ఆయాసంతో వొగర్చాడు.

"ఈ ముష్టిబ్రతుకుకి...తగినదే ఒక్కవరం... నామీద...కోపంలేకుండా...దయ......కాస్త దయతలచమని..."

"దయా?—" తుపాకీ పేల్చినట్లు ఆమాటకి అతను దద్దరిల్లాడు. భూకంపంలోనుంచి క్రొత్తసృష్టిలాగ, ఆవిడ నిలువునా లేచింది!—

"మం...గా!—"

"బికారీ! ఎవరిని పిలుస్తున్నావు?—"

"ఆ...ఆ... అదేమిటి?—మీ...ను...వ్వు— యింతసేపటినుంచీ—మంగ—"

"మంగ చచ్చిపోయింది—నాపేరు నీకు చెప్పి, ఏమిలాభం?—"

అంటూ ఆవిడ గిర్రున తిరిగింది. అవతలకి రెం డడుగులు చకచకా వేసి అంధకారంలోకి

చూసింది—ఆవిడ ఎదురుచూస్తున్న నౌకరుజాడ యింకా కనుపించలేదు. ప్రతిశుక్రవారం సాయంకాలం ఆ దేవాలయం దర్శించడానికి ఆవిడ ప్రత్యేకంగా సన్నాహంచేసేది. ప్రతి ఏడాదీ, ఆ దేరోజున, పూజాద్రవ్యాలతోబాటు ఒక పరికిణీ, గౌనూకూడా పళ్లెంలో ఉంచేవి. దేముడికి నివేదన అయాక ఆ దుస్తులు ఏపిల్లకో తొడిగి చూచుకుంటుండడం ఆనవాయితీ అయింది. ఆయేటికాయేడు దుస్తుల కొలతలు పెరుగుతూవుండేవి. ఆసంవత్సరం ఎనిమిదేళ్లపిల్లకి సరిపడేటట్లుగా వున్నాయి పరికిణీ, గౌనూ. సగందూరం వచ్చాక అవి ఇంటిదగ్గిర మరచిపోయినట్లు గుర్తించి, ఎన్నడూ లేని దీ అపశకునం ఏమిటన్న శంకతోటే వాటికోసం నౌకరుని యింటికి పంపి, తాను దేవాలయం చేరుకుంది—

అవతల పొగమంచు, ఎదుట మనిషి కనుపించనంత దట్టంగా వుంది.

త్రోవ ఆవిడకి బాగా తెలిసిందే. పదిగజాలు నడిచింది. అక్కడ ఆగి రెండునిముషాలపాటు ఏమిటో ఆలోచించింది. మళ్లీ వెనకకు వచ్చింది. గుడిమెట్లమీద కొంచెంసేపు తచ్చాడింది.

తిరిగి తొందరగా గుడిగుమ్మం చేరుకుంది.

విగ్రహవేదికకి అడ్డంగా అతను పడివున్నాడు-

శిరస్సుదగ్గిర కిందగా వెండిపళ్లెం అలాగే ఉంది-

దేముడుదగ్గిర దీపం కొండెక్కుతోంది. గమ్మున వెళ్లి ఆవిడ వొత్తి కాస్త సవరించింది—భగ్గున గర్భగుడి ఒక్కసారి కాంతివంతం అయింది. ఆ వెలుగులో అతని నుదురుమీద నెత్తురు ఆవిడ చూచింది.

దగ్గిరగా వంగి, పరకాయించింది. చిన్న గాయం—మంటపం తగిలివుంటుంది. రక్తం అప్పుడే గడ్డకట్టుకుపోయింది.

ఏదో ఆవేదనపడుతూవున్నట్లు ఆవిడ ఒక్కక్షణం కళ్లు కరుచుకుంది—నిట్టూర్చింది.

చివరికి పైటలోపల వున్న బాడీసులోపల చిన్న బంగారుగొలుసు పైకి తీసింది.

పొలగచ్చుమీద రెండుతలల పాముకిమల్లె అస్పష్టమయిన దీపపువెలుగులో అది మిలమిలలాడింది.

ఆవిడ యింక తటపటాయించలేదు. మెల్లగా వెళ్లి అతని చిరుగులచొక్కా వొత్తిగించింది.

లోపల యింకో చిరుగులచొక్కాజేబులో ఆ గొలుసు పడేసింది. తలఎత్తి ముందున్న విగ్రహానికి ఒక్కసారి చేతులుజోడించి మ్రొక్కింది. మరుక్షణంలో, గర్భగుడిదాటి, గుమ్మందాటి, ఆవిడ బయట మెట్లు చేరుకుంది. నైవేద్యంపళ్లెం ఆవిడచేతులో ఉంది.

"అమ్మా!"—

ఆవిడ వులిక్కిపడింది. వెనక్కి చూస్తే—నౌఖరు!—

"వంటింట్లో లేవండి—యిల్లంతా వెతికాను. మీ మంచంమీద తలగడాకింద దొరికాయి—"అంటూ పరికిణీ, గౌనూ అందిచ్చాడు.

"మంచిపనే చేశే!— యింత ఆలస్యమా దాని కోసం?—"

"యిల్లంతా వెతగడంతోటి—"

"యీలోగా వాడు, యిక్కడ వాకిట నొక్కేసినా అంటేనా?"

"వాడెవడండీ?—"

"దొంగ!—నామెళ్లో గొలుసు తెంపుకుపోయాడు!—

"అమ్మో, అమ్మో, కొంపముంచేశాడు! ఏదండి, ఏదీ?—ఎటు వెళ్లాడు!—"

"చాల్లే, నడు త్వరగా!—యింకా నువ్వొచ్చి పట్టుకుంటావని, యిక్కడ కూర్చుంటాడను కొన్నావా?—

యింతకీ రోజు బాగుంది—ప్రాణం దక్కింది—అదృష్టం, నువ్వూను!—బాబుగారు వచ్చారా?—

"లేదండి యింకాను—అమ్మా, మీపాదాలు పట్టుకుంటాను—"

అని త్రోవపొడుగునా వాపోతూ బావురుమంటూనే వచ్చాడు. వాడు అతిసునౌఖరు.

యీగొడవల్లో తనపని ఎక్కడ వూడిపోతుందో అని భయపడ్డాడు. ఆవిడ అనేకవిధాల అభయం యిచ్చినా, అతగాడి అదటుమాత్రం పూర్తిగా తగ్గిపోలేదు.

ఆవిడ యిల్లు చేరిన కొద్దిసేపటికే 'బాబూజీ' కూడా వచ్చాడు. ఉన్నినూటు, ఓవరుకోటు, ఫెల్టు హాటూ—అతి అట్టహాసంగా ఉన్న ఆ మిష్టరు తంగరాలో వనకటి వేలూపోలికలు ఎంతో వెతికితేనే కాని కనిపించనివిగా వున్నాయి.

"లీలా !...లీలా—"

లీల వచ్చి నిలిచింది. అతి మౌనంగా చూసింది.

"అవును, నేను రాలేదనేనా ? వద్దామనే అనుకున్నాను. ఆ ఆఫీసరూ ఈవేళే రావాలా ?...ఏం చెయ్యమన్నావు చెప్పు !—" అని ఆవిడకళ్లకి అతను సంజాయిషీ చెప్పుకున్నాడు.

ఆవిడ ఇంకా మౌనంగానే నిలిచింది...

"నాఖరు రాలేదూ ?...గుడికి వెళ్లి వచ్చావు కదా ?—ఏదీ ప్రసాదం ?" ..అంటూనే తంగరా వుడుపులు మార్చుకున్నాడు.

ప్రతిశుక్రవారం గుడినుంచి తెచ్చిన ప్రసాదం ముందుగా అతనికి పెట్టడం ఆనవాయితీ. అతను ఆరగిస్తూఉంటే ఆవిడ ప్రక్కని కూర్చుని చిన్నా, పెద్దా అనేకవిషయాలు చెప్పుకుంటూ వుండేవారు.

నాలుగైదువారాలుగా వారి సంభాషణలు సంతానంగురించే ఎక్కువగా జరుగుతూవచ్చాయి.

ఒకసారి మగశిశువు కలిగి మర్నాడే చనిపోవడం, తరువాత రెండుసార్లు గర్భవిచ్ఛిత్తి, క్రమంగా యింక తమకి సంతానం కలగదనే చెంగా—తలపోసుకొని విచారించేవారు.

ఎన్నోవ్రతాలూ, పూజలూ చేశారు. చివరికి ఆవిడఆశలన్నీ గ్రామంలో వదలివచ్చిన శివ చంటి గ్రుడ్డుమీదికే పారడం మొదలెట్టాయి. అతను మొదట్లో అయిష్టత ప్రకటించినా, అనేకరకాలా ఆవిడ అదే స్మరణగా పూరటూవుండడం, వేరేదారిలేకపోవడం, అతనుకూడా చివరికి సరే ననక తప్పింది కాదు.

అతను సరేననడం, ఆవిడ పిల్ల వచ్చినట్లుగానే సంతోషించింది. గ్రామంలో అతని బంధువులకి వుత్తరం వ్రాయించింది. ఏరోజుకారోజే జవాబు వస్తుందని ఎదురుచూసింది. బజారుకి వెళ్లినప్పుడల్లా ఏవో బొమ్మలూ, లక్కపిడతలూ కొనిపోసింది. ఆ ఏడు గౌనూ, పరికిణీ వున్నివి తయారుచేసింది. "చలికాలమూ, అదే తొడుక్కుంటుంది ఈసారి" అని అతి నిర్ధారణగా ఆవిడ అన్నమాటలకి, అతనికి ఆశ్చర్యం, విచారం ఒక్కసారిగానే కలిగాయి. ఏమయినా - ఆశుక్రవారం సాయంకాలం, తనుకూడా తప్పకుండా గుడికి వస్తానని వాగ్దానం చేశాడు.

కాని తలవనితలంపుగా పైఅధికారి తనిఖీకి రావడంచేత రాలేకపోయాడు.

ఆవిడను వెళ్లి రావలసినదని కబురుపెట్టాడు. కబురట్టుకెళ్లిన నౌఖరునే, ఆవిడతోకూడా వుండవలసిందని నియోగించాడు. ప్రసాదం యింటికి పట్టుకొచ్చేటప్పటికైనా అక్కడ వుండాలని అధికారి వెళ్లిపోగానే ఆఫీసునుంచి బయలుదేరాడు. బస్సులో చోటు సాధించి యిల్లు చేరుకునేసరికి యింకా కొంత ఆలస్యం అవకతప్పిందికాదు. ఉడుపులు మార్చి, వుడుకునీళ్లతో కాళ్లూ చేతులూ కడుక్కొని వచ్చే సరికికూడా ఆవిడ అల్లాగే అతిమౌనంగా నిలిచిఉండడం అతనికి ఆశ్చర్యం వేసింది. అప్పుడు పరకాయించిచూశాడు—ఆవిడ చెక్కిళ్లమీద కన్నీళ్లు !—

"లీలా, ఏమిటది ? ఏమయింది?–"

ఆవిడ వెక్కి వెక్కి ఏడుస్తూంది!—

పదేపదే అతను అదే ప్రశ్న వేశాడు. ఎన్నోవిధాల బుజ్జగించాడు. చివరికి—

"ఇవేళ పూజ జరిగిందా ?" అని మొదటికి వెళ్లాడు.

"నా పాపానికి యింక పూజలేదు".

"ఏమిటి లీలా నీమాటలు!—ఒక్కసారిగా ఈదుఃఖానికి కారణం కాస్త చెప్పకూడదా నాతో? చూడు, లీలా!"

"నా చిన్న—నా చిన్న—"

"ఏమయింది?—ఏమన్నా వుత్తరం వచ్చిందా? చెప్పవేం మరీ—"

"వుత్తరం లేదు. నాకు తెలుసు. ఇంక నా చిన్న రాదు—"

"అదేమిటి లీలా, ఉత్తరము లేందే—అసలు సంగతి తెలియందే—"

"తెలిసింది, ఈవేళతో అంతా తెలిసింది. నాపాపానికింక పూజ లేదు. నా చిన్న యింక రాదు—"

అని ఆరోజున ఆగానూ పరికిణీ, నైవేద్యం వేళకి అందకుండా యింటిదగ్గిర వుండిపోయిన వృత్తాంతం చెప్పింది. అన్ని ఏళ్లనుంచీ లేని యీ అపశకునం అశుభం సూచిస్తోందని తన అనుమానంగా నివేదించింది.

ఆకథ అంతా విని అతను ఫక్కున నవ్వాడు! "చంపేశావు! ఈమాత్రానికేనా" అంటూ, ఆవిడ తెలివితనానికి ఆశ్చర్యపోయాడు.

"ఈమాత్రమే కాదు—యింకో అపశకునం—చిన్నకని చేయించిన ఆ చిన్నగొలుసు—"

"ఆ, ఆ, ఆగొలుసు—?"

"పోయింది!—అదీ యీ వేళే—ఆగుడిలోనే—"

అని నాఖరుతో చెప్పినదే దొంగకథ అతనికి కూడా చెప్పింది.

"నయమే యింకా!—ప్రాణం దక్కింది, అంతే చాలు. నే నిప్పుడే వెళ్లి పోలీసులకి రిపోర్టు యిస్తాను—"

"యీ చలిలో ఇప్పుడేమిటి? ప్రొద్దున్న చూచుకోవచ్చు—"

"కాదు, కాదు, వెంటనే రిపోర్టుచెయ్యాలి—ఇప్పుడే వచ్చేస్తాను—" అంటూ అతను లేచాడు.

"ప్రసాదం"—

"వచ్చేస్తానుగా—?"

"పుచ్చుకుని వెళ్లండి, యిప్పుడే తెస్తాను—" అని ఆవిడ బలవంతం చేసింది. సరేనని అతను మళ్లీ చతికిలపడ్డాడు. వంటయింట్లో పెట్టిన వెండిపళ్లెం ఆపళంగానే ఆవిడ తీసుకొచ్చింది. హడావిడిగా అతను మాట్లాడుతూనే తింటున్నాడు!

"ఎంతపని జరిగింది!—అయినా అదో పాడు గుడి! పగలే మనుష్యు లుండరు!— ఒక్కర్తెవు అక్కడ—లీలా!—"అతను కవ్వమన్నాడు!

పళ్లెంలో పళ్లమధ్య పామో, తేలో వేళ్లకి తగిలినట్లు, భయంతో గమ్మున లేచిపోయాడు. భళ్లున పళ్లెం నేలమీద ప్రోగింది.

"ఏమిటి, ఏమిటి ?" అంటూ ఆవిడ దగ్గరకు పరుగెత్తింది. పడిన పళ్లెం తీసి బల్లమీద పెట్టింది. చెదిరిపోయిన పళ్లూ, ప్రసాదం ఏరి అందులో పెట్టింది. సగం కొరికిన అరటిపండు అతని చేతులో వణుకుతోంది.

"అదేమిటి—అల్లా వులిక్కిపడ్డారు?—"

"చూడు ఆపళ్లెంలో—"

"పళ్లెంలోనా—?" అని ఆవిడ పళ్లెంలో వాలి చూసింది.

"ఏమిటి మీ రనేది?—యివేళ అన్నీ యిల్లాగే, అపశకునాలు—"

"యింకోటీ యిది—"

"ఏదీ—?"

"సెత్తురు!"

"నెత్తురా! ఎక్కడ—"

"అదేం, పళ్లెంలో!—యిదిగో, యీ అరటి పండంతా అదే—"

"కుంకం ఏమో! తడిసి అల్లాగ—"

"కాదు, కాదు—నెత్తురే!—యీ నైవేద్యం అంతా నెత్తురు!—"

ఆవిడ చూసింది. నిజమే, నెత్తురు!

ఒక్కక్షణం ఆవిడ కంగారుపడింది. గుడిలో [illegible]

గమ్మున ఆవిడమనస్సంతా ఆవరించాయి—నరనరాలా సలుపెట్టాయి—ఏవేవో పూర్వస్మృతులలో కొట్టుకు పోతూ, ఆవిడ అలాగే స్మృతివిహీనలాగ నిలబడి పోయింది !—

"లీలా, యిదంతా ఏమిటో—నాకు కలలాగ వుంది—యీ పీడకల—నెత్తురు—నైవేద్యం—" చటుక్కున ఆవిడ మేలుకుంది. పెద్దగా ఒక్కసారి నిట్టూర్చింది. ఆ పూర్వ వుషస్సంధ్యలో ఒకళకం ఏదో మళ్లీపోయినట్లు, ఆవిడకళ్లు రెపరెపలాడాయి. ముఖం జేవురించింది.

"అవును-యిప్పుడు గుర్తు వస్తోంది. గొలుసు లాక్కోడంలో ఆ దొంగ దేవుడుమంటపంమీద తూలి పడ్డాడు. తల రాతిమీద కొట్టుకుంది. ఆ నెత్తురు చిందులు కొన్ని కిందనే వున్న నైవేద్యంపళ్లెంలో పడివుంటాయి—"అని ఆవిడ చాలా ధీమాతో సంజాయిషీ చెప్పింది.

తంగన్ కొంతసేపు తరిచితరిచి ఏదో ప్రశ్నలడిగాడు. ఆఖరికి ఆ గొడవంతా ఒకమాదిరిగా అవగాహనచేసుకున్నట్లు సంతృప్తిపడ్డాక—

"సరే, నేను వెళ్లి రిపోర్టు ఇచ్చివస్తాను.—"అని లేచాడు—"

"యింక రిపోర్టుఇచ్చి ఏమిలాభం, అవిధి తప్పు?—అయినా, యిప్పు డింతరాత్రివేళ వెళ్లేదేమిటి, ప్రొద్దున్న చూసుకోవచ్చును—"

"అదేమిటి లీలా—యింతగొడవ జరిగాక రిపోర్టివ్వకుండానా ?— ఎంతసేపు, యిక్కడేగా థానా ?—" అంటూ తంగన్ బయటకు బయలుదేరాడు.

* * *

ఆరోజు ఆదివారం. ఉదయం ఎనిమిదయినా, రాజధాని ఢిల్లీ యింకా నిద్రలేవలేదు. పొగమంచు మాటున గడ్డకట్టివున్న తరతరాల గాథలతో, బాధలతో, కలలు దులుపుకుంటూ యమున అప్పుడప్పుడే బద్ధకంగా లేచి కూలంకషా పోతోంది. ఆమె కళ్లలో అక్కడక్కడ ఎర్రజీర లగుపిస్తున్నాయి. ఆవేళటి దినపత్రికమడతలలో యుద్ధాలూ, మతకలహాలతో బాటు ఎన్నో చిల్లరసమాచారాలుకూడా యిరుక్కుని తంగన్ యింటివరండామూల పడివున్నాయి.

తంగన్ అప్పుడే లేచాడు. కాఫీతోబాటే పత్రికకూడా తెచ్చి బల్లమీద పెట్టాడు నౌకరు. కాఫీ త్రాగుతూ, పత్రిక చూస్తున్న తంగన్ అమాంతంగా లేచి నిలుచున్నాడు.

"లీలా—!...లీలా—!"

"వస్తున్నా—" అని ఆవిడ వచ్చేలోపుగానే, అతను పత్రికతో సహా అల్లాగే వంటింట్లోకి పరుగెత్తాడు.

"చూశావా, పేపరులో పడింది—"

"ఏమిటి ?—మీ పేరా ?"

"ఉష్, ఎగతాళికాదు, నిజం ! మన గొలుసు—నీ నానుపేటలు—"

"ఏ నానుపేటలండీ ? చెప్పు ఏమిటో సరిగ్గా—"

"భలే బాగుంది ! అప్పుడే మరిచిపోయావూ? గుడిలో —ఆ దొంగాడు తీసుకుపోయిన గొలుసు—"

"ఓ, అదా!—అప్పటికిప్పుడు ఆకథంతా పేపరులో వేయించారా?"

"ఆ కథ కాదు, దానితర్వాతి గాథ ! దొంగని పట్టుకున్నారు ! గొలుసు దొరికింది!"

"ఎక్కడ ?—ఏం చేశా రా—దొం—గని ?"

"ఏం చెయ్యనక్కరలేకుండానే, వాడి ఖర్మాన వాడు పోయాడు !"

"పారిపోయాడా !—"

"అబ్బే, అది కాదు ! విను, చదువుతాను—

'ఢిల్లీ, డిసెంబరు ౨౯—

నిన్న సాయంకాలం రెడ్ఫోర్టుదగ్గిర మైదానంలో కమ్యూనిస్టులు ఏర్పాటుచేసిన సభ ఒకటి పోలీసులు చెదరగొట్టాల్సివచ్చింది. ఆ సందర్భంలోనే అయిదుగురు గూండాలనికూడా అరెస్టుచేశారు.

అందులో ఒక ఆసామీని సోదా చెయ్యగా, లోగడ తిమారుపూరుశివాలయంలో చోరీఅయిన నగలు కొన్ని దొరికాయి. క్షయరోగంతో తీసుకుంటున్న అతను—ఊరేమిటో పేరేమిటో—ఎంత ప్రయత్నించినా, చెప్పడానికి నిరాకరించాడు. రాత్రి డాక్టరు వచ్చి చూసిన కొద్దిసేపటికే అతను సబుజైలులో మరణించాడు.''—

ఆవిడకళ్లు చీకట్లు కమ్మాయి. తల తిరిగింది. పేపరునించి తల పైకెత్తి, అతను ఒక్కవురుకున ఆమె ప్రక్కని ఆదుకున్నాడు.

"అదేమిటి—లీలా!"

క్షణం తప్పితే, క్రింద, మండుతున్న కుంపటి—ప్రమాదం తప్పి, అతని చేతులలోకి వొరిగింది. పైన పడిన కన్నీటిచుక్కలవేమో, నిప్పులు కస్సుమన్నాయి. 'అదేమిట'న్న అతని ప్రశ్నమాత్రం, అలాగే సమాధానం లేకుండా మాటుమణిగిపోయింది. యమున దాచుకున్న కథలకి యింకో గాథ జతపడింది.

---

# పికవంది

## శ్రీ దిగుమర్తి సీతారామస్వామి

హృదయమే లేని భువికొర కేగుదెంచి
నది వసంతము—దివిజనందనమునుండి
సీమసీమల బలిసి విచ్చినవి పూలు
కాని తేటికి కరవయ్యె తేనెచినుకు.

ప్రథమ యౌవన దృఢపరిష్వంగమందు
తావియే సర్వమయి జగ మావరింప
కైపుగొని చూచు సరమోద్భుతకనులయందు
ప్రతిఫలించి వసంతమ్ము భవ్యమయ్యె.

అతడు ఋతురాజు కౌగిలి కడుగకుండ
వచ్చి వాలని లత లేదు మచ్చు కనుచు
పరభృతంబు వాగనీ—సరస జాతి
జాతి పూదరి రాణివాసమున గాదె ?